ప్రజాశక్తి

మంగళవారం 14 అక్టోబర్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పల్నాడు జిల్లాకు ప్రాధాన్యం

- నూతన ఉపాధ్యాయులతో పాఠశాలలు కళకళ
- చాలాకాలం తర్వాత పోస్టుల భర్తీతో విద్యార్థుల హుషారు

పోస్టింగ్ ఉత్తర్వులతో వెల్దుర్తి పాఠశాలలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

డిఎస్‌సి ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులు సోమవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరితో పాఠశాలలన్నీ కళకళలాడాయి. ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఎక్కువ మందికి పోస్టింగ్‌లు ఇవ్వడంతో పల్నాడు జిల్లాలోని ఎక్కువ పాఠశాలలు నిండుదనంతో కనిపించాయి. దీంతో ఉపాధ్యాయుల కొరత కొంత మేరకు తీరింది. ఎక్కువ ఖాళీలు ఉన్న వెల్దుర్తి, బొల్లాపల్లి, దుర్గి, గురజాల, పిడుగురాళ్ల, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, వినుకొండ, శావల్యాపురం, ఈపూరు తదితర మండలాలకు అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. పట్టణ ప్రాంతాలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఖాళీల భర్తీకి తక్కువ ప్రాధాన్యమిచ్చి వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయులుగా ఎంపికైన వారంతా వారం రోజుల పాటు శిక్షణ పొంది, పోస్టింగ్‌ల కోసం రెండు రోజుల క్రితం కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్‌లు ఇచ్చారు. అనంతరం ఆన్‌లైన్‌లో పోస్టింగ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరు సోమవారం ఉద్యోగాల్లో చేరాలని ప్రభుత్వం సూచించింది. మొత్తం 1140 మంది ఉపాధ్యాయుల్లో మొదటి రోజు 1100 మంది వరకు విధులు చేరారని తెలిసింది. వీరంతా సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు జాయినింగ్ రిపోర్టులు అందించారు. ఎంతో కాలంగా ఉపాధ్యాయులు కొరతతో, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు లేక ఇబ్బందుల పడుతున్న విద్యార్థులకు కొత్త ఉపాధ్యాయుల రాకతో ఉత్సాహం కన్పించింది.

ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల్లో పల్నాడు జిల్లాలోని 28 మండలాలకు దాదాపు 700 మంది విధుల్లో చేరారు. వీరిల్లో వెల్దుర్తికి 96, దుర్గికి 80, బొల్లాపల్లికి 85 మందికి కేటాయించారు. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో 10 మండలాలకు 150 మందికి పోస్టింగ్‌లు దక్కగా మిగతా వారు విభజిత గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరిలో స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. అయితే రాజకీయ వత్తిడిల నేపథ్యంలో గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్‌లతో పాటు తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీల్లో ఖాళీల భర్తీకి అధికారులు ప్రాధాన్యమిచ్చారని తెలిసింది. జోనల్ స్థాయిలో మొత్తం 582 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిల్లో పిజిటి, టిజిటిలుగా ఎంపికైన వారిలో 100 మంది వరకు ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాలల్లో పోస్టింగ్‌లు పొందారు.

దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

వేల ఎకరాలున్నా పేదలకు ఎందుకివ్వరు?

- ఎన్నికల నాటి హామీని నిలబెట్టుకోవాలి
- అద్దెలు చెల్లించలేక అవస్థ పడుతున్న సామాన్యులు
- 17న ధర్నా : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం మంగళగిరిలో దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

పారిశ్రామిక వేత్తలకు వందల వేల ఎకరాలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం పేదలకు మాత్రం ఇళ్ల స్థలం ఇవ్వడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం చేపట్టిన నిరసన దీక్షలను బాబూరావు ప్రారంభించారు. కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అధ్యక్ష వహించగా బాబూరావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తామని మంత్రి నారా లోకేష్ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చడం లేదని, ఇళ్ల స్థలం లేని పేదలు 20 వేల మంది ఉండగా వీరికి ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తానని లోకేష్ చెప్పారని గుర్తు చేశారు. 20 వేల మంది పేదలు వివిధ భూముల్లో ఇళ్లేసుకుని

▶ 2లో

కౌల్దార్లకు మాట ఇచ్చి మోసం..

గుర్తింపుకార్డులు, పెట్టుబడి సాయం కోసం కౌలురైతు సంఘం వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలురైతులకు గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం, పంట రుణాల మంజూరు అంశాల్లో ఎన్నికల నాటి హామీని కూటమి ప్రభుత్వం విస్మరించి కౌల్దార్లను మోసం చేసిందని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ మండిపడ్డారు. ఈ సమస్యలపై నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. పాత చట్టం దుర్మార్గమైందని, అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభలు ద్వారా కౌల్దార్లకు కార్డులు ఇస్తామని కూటమి చెప్పిందని, పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తున్నామని అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించి కూడా విస్మరించారని అన్నారు. భూ యజమాని సంతకం తప్పనిసరి కావడంతో వారు సహకరించడం లేదని, పంట రుణాలు, పెట్టుబడి సహాయం పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట అమ్ముకోవడానికి ఇబ్బందులు లేకుండా సత్వరం నూతన చట్టం తేవాలని కోరారు. కౌలురైతుల్లో 70 శాతం పైగా బడుగు బలహీన వర్గాలవారేనని, అధిక శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారని చెప్పారు. పంట సాగు చేయని భూ యజమానులకు పెట్టుబడి సహాయం అందుతుండగా వాస్తవసాగుదారులు మాత్రం అప్పుటు చేసి పంటలు పండిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కౌలు రైతులకు ఒకే విడతలో అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఇవ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని, మృతి చెందిన రైతుల భార్యలకు వితంతు పింఛన్లు, పిల్లలకు విద్య అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం మండల కార్యదర్శి కె.ఆంజనేయులు, సిహెచ్.మహమ్మద్ ఖాసిం, నరసింహారావు, వై.లక్ష్మణరావు ఉన్నారు.

మహిళ అవయవ దానం.. ఇద్దరి జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి- తాడేపల్లి

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై బ్రెయిన్ డెడ్ అయిన మహిళ కుటుంబీకులు అవయవ దానానికి ముందుకొచ్చి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారు. పట్టణంలోని నులకపేటకు చెందిన రాజులపాటి పాప (64) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గుర్వగా ఆమెను స్థానిక మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. మెదడు ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోవడంతో బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అవయవదానంపై పాప కుటుంబీకులకు మణిపాల్ వైద్యులు వివరించగా వారందుకు అంగీకరించారు. దీంతో జీవన్ దాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, మణిపాల్ ఆస్పత్రి డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పాప కాలేయం మణిపాల్ హాస్పిటల్‌లో ఒకరికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. కార్నియాను విజయవాడ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు.

18న ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ - 2 లో

కల్తీమద్యంపై వైసిపి నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లా విలేకర్లు

గుంటూరులో నిరసన తెలుపుతున్న వైసిపి శ్రేణులు

బెల్ట్ షాపుల ద్వారా అక్రమార్జన చాలక కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం విక్రయాలని పెంచి పోషిస్తుందని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు విమర్శించారు. ఈ మేరకు ఆ పార్టీ పిలుపు మేరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సోమవారం నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరులో శంకర్‌విలాస్ సెంటర్ నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నూరి ఫాతిమా పాల్గొన్నారు. తెనాలిలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో శివాజీ చౌక్ నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. నకిలీ మద్యం వ్యవహారంలో అధికార పార్టీకి ఎక్సైజ్ అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. వినుకొండలో వైసిపి కార్యాలయం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. మాచర్ల, పిడుగురాళ్ల, క్రోసూరులో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన అనంతరం వినతిపత్రం ఇచ్చారు. తాడికొండలో బస్టాండ్ సెంటర్ నుండి పోలీస్‌స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు వైసిపి నియోజకర్గ సమన్వయకర్త వనమా డైమండ్ బాబు ఆధ్వర్యంలో ర్యాలీ చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. పొన్నూరులో నియోజ కవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నకిలీ మద్యంతో ఒక్క ఏడాదిలోనే రూ.5,280 కోట్లు టిడిపి ముఠా దోచుకుందని, సిబిఐ దర్యాప్తు చేపట్టాలని అన్నారు. మంగళగిరిలో ర్యాలీ చేసి ఎక్సైజ్ సిఐకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డి.వేమారెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో టిడిపి నాయకుడు జయచంద్ర, అతని అనుచరులు నకిలీ మద్యం తయారు తయారు చేస్తున్నారని ఆరోపించారు. సత్తెనపల్లిలో నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సిఐ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్ పుష్పగుచ్ఛం అందచేస్తున్న నాయకులు

కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగుల సంఘం అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ నాయకులు నూతన జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాను కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి, అభినందనలు తెలెపారు. సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు.కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్వర్లు, సంఘ కార్యదర్శి కె.లూర్దురెడ్డి, రాష్ట్ర సంఘ కోశాధికారి పి.నాగరాజు, గౌరవ సభ్యులు రామకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు అయ్యంగార్ పోస్టర్ల దగ్ధం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

జాతిపిత మహాత్మా గాంధీని ఉద్దేశించి తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ చేసిన వ్యాఖ్యలకు గుంటూరులో ఎన్.ఎస్.యు. ఐ. కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు నాజ్ అప్సర థియేటర్ లో శ్రీకాంత్ అయ్యంగార్ నటించిన ఆరి సినిమా విడుదల అయినా నేపథ్యంలో థియేటర్ వద్ద పోస్టర్లను చింపేస్తూ శ్రీకాంత్ చిత్రపటానికి నల్ల రంగు పూస్తూ వాటిని తగుల బెట్టారు. ఎన్ . ఎస్.యు. ఐ కో ఆర్డినేటర్ కరీం మీడియాతో మాట్లాడుతూ మహాత్మగాంధీపై సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

విఐపి రోడ్డులో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మేయర్

అభివృద్ధి పనులను తనిఖీ చేసిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు : నగర శివారు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర జిఎంసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని 25వ డివిజన్ వి.ఐ.పిరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే కావేరి నగర్‌లో మురుగునీరు పారుదల సరిగా లేదని ప్రజల నుండి అందిన పిర్యాదు మేరకు సదరు ప్రాంతంలో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో తొలుత వి.ఐ.పి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ పనులను తనిఖీ చేశారు. నగరంలో నిర్వహిస్తున్న అభివద్ధి పనులను త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని, అభివద్ధి పనులు జరిగే సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా డ్రైన్లు నిర్మించే సమయంలో ఎటువంటి వంకరలు లేకుండా మురుగు నీరు పారుదల సవ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కావేరి నగర్‌లో మురుగు నీరు సరిగా పారుదల లేక స్థానికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు పిర్యాదు చేసిన నేపథ్యంలో సదరు ప్రాంతంలో పర్యటించి, పరిసరాలను పరిశీలించి తగు ఆదేశాలు ఇచ్చారు. సదరు పర్యటనలో కాపోరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, ఇంచార్జ్ యస్.ఈ సుందర్రామిరెడ్డి, ఈ.ఈ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

18న ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభ అక్టోబర్ 18వ తేదీన గుంటూరు జిల్లాలోని ఎన్‌జిఒ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు యూనియన్ డివిజన్ సంయుక్త కార్యదర్శి వివికె.సురేష్ తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను అరండల్‌పేటలోని ఎల్‌ఐసి కార్యాలయంలో యూనియన్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఉమ్మడి, గుంటూరు, కృష్ణా జిల్లాల నుండ సుమారు 300 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరవుతారని, సౌత్ సెంట్రల్‌జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు పి.సతీష్ మహాసభను ప్రారంభిస్తారని సురేష్ తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జోనల్ సంయుక్త సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్‌బాబు, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ, డివిజన్ అధ్యక్షులు జె.సుధాకర్, ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, మహిళా ఉద్యోగుల డివిజన్ కన్వీనర్ సిహెచ్.మధుబాల మహాసభకు హాజరవుతారన్నారు. బీమా రంగంలో విదేశీ ఈక్విటీ పెంపుదల, ఎల్‌ఐసిలో ఉద్యోగుల నియామకం, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, ఎల్‌ఐసి పరిరక్షణకు విస్తృత ప్రచారం వంటి అనేక అంశాలను మహాభసల్లో చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకుంటామని చెప్పారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరించటం సుదీర్ఘకాలంగా యూనియన్ ఆధ్వర్యంలో విస్తృత పోరాట ఫలితమేనన్నారు. నూతన కమిటీ, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై పలు తీర్మానాలు చేస్తామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు డి.సైదులు, ఆర్‌విఎస్ శ్రీనివాస్, వి.ఆర్.గోపాలకృష్ణ, సిహెచ్.మధుబాల, పి.ఆర్.రాజశేఖర్, ఆర్.విజయరాఘవ, ఐ.వెంకట్రావు, జె.రాజేప్రసాద్, డి.ఉమామహేశ్వరరావు, ఎ.ఉషాబాల, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

మిర్చి యార్డు కార్యకలాపాలకు ఆటంకాలు వద్దు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డ్ లో కార్యకలాపాలకు ఆటంకాలు కలిగించ వద్దని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. సోమవారం మిర్చి యార్డ్ అధికారులు, ట్రేడర్లు, లారీ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మిర్చి యార్డు కార్యకలాపాలు సజావుగా జరుగుటకు అందరూ సహకరించాలన్నారు. గుంటూరు మిర్చి యార్డు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ప్రదేశం అని ఇటువంటి యార్డులో కార్యకలాపాలు ఆటంకం లేకుండా జరగడం వలన మరింత ప్రతిష్ట

పెరుగుతుందని అన్నారు. ట్రేడర్లు లారీ సంఘ సభ్యులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు వర్గాలకు నష్టం లేకుండా ప్రశాంత వాతావరణంలో సానుకూల ధృక్పథంలో సమస్య పరిష్కారం కావాలని పేర్కొన్నారు. ఇరువర్గాలు చర్చించిన అనంతరం వివరాలను సమర్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, ఉప రవాణా కమిషనర్ సీతారామరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ.చంద్రిక, ట్రేడర్లు, ఎగుమతిదారులు, లారీ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేల ఎకరాలున్నా పేదలకు ఎందుకివ్వరు?

(మొదటి పేజీ తరువాయి)

ఉంటున్నారని, వారందరికీ ఇళ్ల పట్టాలిస్తామని వాగ్దానం చేసినా 3 వేల మందికే ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే అద్దె ఇళ్లల్లో ఉంటూ పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వారికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామనే మాటను విస్మరించి టిడ్కో గృహాలు ఇస్తామనడం సరికాదని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వ్యక్తిగతంగా ఇళ్ల స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి భూములు లేవని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం టిడిపి, వైసిపి రాష్ట్ర కార్యాలయాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వ భూములను ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. అధికారులతో మంత్రి పలుమార్లు సమీక్షిస్తున్నా ఇళ్ల స్థలాలపై ఒక్కసారి కూడా చర్చించలేదని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో వేల ఎకరాలు భూమి ఉందని, పేదలకు ఇళ్ల స్థలాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ సమస్యపై ఈనెల 17న దరఖాస్తులతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, అప్పటికి ప్రభుత్వం దిగి రాకపోతే దశలవారీగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ సమీపంలో మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా వేసిన శిలాఫలకం ప్రకారం 20 వేల మంది ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని, ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న 20 వేల మంది పేదలకు పట్టాలిస్తామని పేర్కొన్నారని తెలిపారు. ఆ వాగ్దానాన్ని అమలు చేయాలని, లబ్ధిదార్ల జాబితాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి మాట్లాడుతూ రాజధాని గ్రామాల్లో భూములున్నాయని, ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.అప్పారావు, నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, బి.వెంకటేశ్వరరావు, జెవి రాఘవులు, పి.బాలకృష్ణ, ఎం.పకీరయ్య, వి.దుర్గారావు పి.కృష్ణ, బి.కోటేశ్వరి, డి.రామారావు, యు.దుర్గారావు, ఎం.చలపతిరావు, ఎస్.గణేష్, ఎం.బాలాజీ, ఎం.నాగేశ్వరావు, ఎం.చంద్రరావు, ఎం.భాగ్యరాజు, వి.వెంకటేశ్వరరావు, టి.శ్రీరాములు, జి.బాబువరప్రసాద్

దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

పాల్గొన్నారు. కాగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : పట్టణంలోని సుందరయ్య నగర్, మహానాడు కృష్ణానది ఒడ్డు, బర్మా సీతారామయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలు పెద్ద ఎత్తున కదిలి వచ్చి ఇళ్లస్థలా ల కోసం అర్జీలను సిపిఎం కార్యకర్తల నుండి అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.నాగేశ్వరరావు, బి.రామారావు, డి.లక్ష్మణ, చక్రి, ఎస్‌కె.బాష, వి.రామకృష్ణారెడ్డి, ప్రసన్న లక్ష్మి, పద్మ, ఎన్.ఉమామహేశ్వరి, నాని, ప్రభాకర్, కొండబాబు పాల్గొన్నారు.

బాల్యం ఆరంభ దశపై అవగాహన

ప్రజాశక్తి - గుంటూరు

పిల్లలను బాల్య ఆరంభ దశలో మూడేళ్లు నిండగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని, 90 శాతం మెదడు అభివద్ధి ఐదేళ్లలోపే జరుగుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ అరుణకుమారి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జన్మభూమి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ - ఎడ్యుకేషన్'పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ బాల్య ఆరంభ దశలో పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చటం ద్వారా వారికి ఆట, పాటలతో విద్య నేర్పిస్తారని, ఈ వయస్సులోనే పిల్లలలో అన్ని రకాల అభివద్ధి జరుగుతుందని అన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు, అంకెలు, అక్షరాలు, రంగులు గుర్తించటం, మాటలు, సజనాత్మకత అంగన్‌వాడీ కేంద్రంలో నేర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, యు.పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ కీర్తి, ఐటిసి బంగారు భవిష్యత్తు ప్రోగ్రాం బాధ్యులు స్మిత, వీరనారాయణ, ఇ.శైలజ, ప్రథమ సంస్థ బాధ్యులు స్వాతి, టిడిపి నాయకులు టి.మురళి, ఎఎన్ఎం, అంగన్వాడీలు శివలీల, పద్మావతి, సంధ్య, నాగమణి, పార్వతి పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - నకరికల్లు

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 1.7 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను సత్తెనపల్లి రూరల్ సిఐ పి.కిరణ్ సోమవారం వెల్లడించారు. రాజుపాలెం మండలం గణపవరానికి చెందిన పోలిశెట్టి నాగరాజు ద్విచక్ర వాహనంపై నకరికల్లు మండలంలోని శ్రీరాంపురంలోగల నాగేంద్ర స్వామి దేవస్థానం వద్ద నుండి కొండమోడు వెళుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. గంజాయిని గుర్తించి సరుకుతోపాటు ద్విచక్ర వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుణ్ణి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

పచ్చదనం- పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండల పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ఎంపిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణంతోపాటు, గ్రామ పరిసరాల్లో పాటించాల్సిన పారిశుధ్యం, పరిశుభ్రత పెంపొందించేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి శివ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న బాలసాని కిరణ్ కుమార్

నకిలీ మద్యాన్ని అరికట్టాలని నిరసన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని ప్రత్తిపాడు నియో జక వర్గ కేంద్రంలో వైసిపి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ బాలసాని కిరణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద నుంచి ఎక్సయిజ్ స్టేషన్ వరకు నకిలీ మద్యం అరికట్టాలనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. మండల కన్వీనర్లు ఖాసీంపీర, హనుమంత్ యాదవ్, మన్నవ వీరనారాయణ, శివరామ కష్ణ, నియోజకవర్గ బూత్ కన్వీనర్ ఓం ప్రకాశ్ రెడ్డి, సుధాకర్, బాపతు వెంకటరమణ, కవిత, పిల్లి మేరీ పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

ప్రజాశక్తి - కొల్లిపర

వరుస చోరీలతో కొల్లిపర గ్రామ ప్రజలు బెంబేలు చెందుతున్నారు. గతంలో కొల్లిపర గ్రామంలో తాళం వేసిన గృహాలలో దొంగతనాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసినా మళ్లీదొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి సుబ్బారెడ్డి గృహంలో దొంగలు పడి ల్యాప్‌టాప్ సెల్‌ఫోన్, వెండి వస్తువులు దొంగిలించారు. వీటి విలువ రూ.75 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. కొలిపర ఎస్సై కోటేశ్వరావు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 20లక్షలతో సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వంగిపురం గ్రామంలో సిసి రోడ్డుకి గ్రామ సర్పంచ్ శిఖా విజయ లక్ష్మీ ఎంపీడీఓ శివపార్వతితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. సిసిరోడ్లను రూ.20 లక్షలతో నిర్మించ నున్నారు. మండల పరిషత్ గ్రాంట్ రూ.10లక్షలు, జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలు మొత్తం మూడు రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు,మండల కన్వీనర్ గింజుపల్లి శివ రామ ప్రసాద్, పాత మల్లయ పాలెం సొసైటీ ప్రసిడెంట్ కుర్రీ సుబ్బారెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కాసు పెంట రెడ్డి, తిక్కిరెడ్డి పాలెం సర్పంచ్ జగన్ మోహన్ రావు,ఎంపీటీసీ పాలేటి సాంబశివరావు, ప్రత్తిపాడు తెలుగు యువత కార్యదర్శి శిఖా నవీన్,వెలివెల్లి సుబ్బారావు,సుబ్బయ్య పాల్గొన్నారు.

సిసి రోడ్డుకి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిడిఓ

ఆరుగురి బైండోవర్

ప్రజాశక్తి–ఈపూరు

ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోని ఈపూరు రొంపిచర్ల బొల్లాపల్లి మండలాలకు సంబంధించి మద్యం కేసుకు సంబంధించి ఆరు గురిని సోమవారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ డి.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను, రొంపిచర్ల మండలం సంతగుడిపాడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను, బొల్లాపల్లి మండలం ఘాటితండాకు చెందిన ఒకరిని ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో తహశీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

మందుగుండు సామగ్రి దుకాణాలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

బాణసంచా దుకాణాల్లో ఆర్డీవో తనిఖీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలంలోని బాణాసంచా సామాగ్రి విక్రయ దుకాణాలను సత్తెనపల్లి ఆర్డీవో జి. రమణకాంతరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. వెన్నాదేవి సమీపంలో ఉన్న విగ్నేశ్వర ఫైర్‌వర్క్స్ , మురళి నగర్ సమీపంలో ఉన్న పార్వతీ ఫైర్ వర్క్స్, వెంకట సాయి ఏజెన్సీ, సత్తెనపల్లి పట్టణ పరిధిలోని ఫిరోజ్ బాణాసంచా దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. లైసెన్సులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా దుకాణాల వద్ద వాటర్, డ్రమ్ములు ఇసుక బకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరిమిషన్లు ఉంటేనే అమ్మకాలు జరపాలని సూచించారు.

ప్రజాశక్తి - తాడికొండ

దీపావళి బాణసంచా విక్రయదారులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాడికొండ సీఐ కె.వాసు అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ టపాకాయలను లైసెన్సు పొందిన షాపుల వద్దనే కొనుగోలు చేయా లన్నారు. అనుమతి లేకుండా స్టాళ్లు వేసి బాణసంచా నిల్వ ఉంచినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటా మన్నా రు. దుకాణదారులు తమషాపు పరిసరాల్లో అగ్ని ప్రమాదం జరగకుండా అత్యంత జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. ప్రతి షాపు వద్ద నీటి డ్రమ్ములు, ఇసుక బకెట్ లేదా సంచులు, ఇతర భద్రతా సామాగ్రి ఉంచాలని తెలిపారు. తాడి కొండలోని ఎస్‌వివి హైస్కూల్‌లోని మైదానంలో ఈనెల 18 నుండి దుకాణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని సీఐ తెలిపారు. బాణాసంచా విక్రయదారులు సంబంధిత పత్రాలతో పోలీస్‌స్టేషన్లో ఈనెల 18వ తేదీ లోపు అనుమతి పొందాలని తెలిపారు. దుకాణాదారులు ప్రతిషాపు వద్ద పోలీసు, ఫైర్ సిబ్బంది ఫోన్ నంబర్లను ప్రద ర్శించాలన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

దీపావళి పండుగ సందర్భంగా బాణా సంచా విక్రయాలకు అనుమతులు, లైసెన్సు లకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను మండలాలకు చెందిన వ్యాపా రులు సంబంధిత ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గడువు దాటిన దరఖాస్తులు

కావలెను

మంగళగిరి వి.టి.జె.యం & ఐ.వి.టి.ఆర్. డిగ్రీ కళాశాల నందు కంప్యూటర్ సబ్జెక్టు బోధించుటకు అధ్యాపకులు కావలెను. మీ అర్హతా పత్రాలతో ది. 18-10-2025 లోగా కళాశాలలో ప్రిన్సిపల్, వి.టి.జె.యం & ఐ.వి.టి.ఆర్. డిగ్రీ కళాశాల, మంగళగిరి. ఫోన్:97056 18919 కు సంప్రదించగలరు.

ఒరిజినల్ దస్తావేజు, బ్యాంక్ పాస్‌బుక్ పోయినవి

నా కుమార్తె ఉద్దండు రోహిణి పేరున గల దస్తావేజు నెం. 7645/ 2014, తేది : 06-08-2014 ఒరిజనల్ దస్తావేజు మరియు బ్యాంకు పాసు పుస్తకం. ది 22-09-2025వ తేదీన కొండవీడు- సంఘం గోపాలపురం మార్గమధ్యంలో జారి పడి పోయినవి. కావున గ్రామ ప్రజలకు దొరికిన యెడల ఆ పత్రములను నాకు అందించ గలరు. తగిన బహుమానం ఇవ్వగలము.

ఇట్లు
ఉద్దండ సుధావర్ణ, చిలకలూరి పేట.
(సెల్ నెం. 8919436519)

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్, R/D No; 12-6-5, టౌన్ హాల్ వెనుక రోడ్డు ప్రాంతానికి చెందిన లంకా శ్రీనివాసశర్మ S/o లంకా లక్ష్మీ నరసింహ శర్మ అను నేను యావన్మందికి తెలియజేయినది ఏమనగా ఇంటి రిజిస్ట్రేషన్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 4692/2025 ది.13/03/2025 కు చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.1812/1990 ది. 30/04/1990 జిరాక్స్ నిమిత్తం ది.9/10/2025 న ద్విచక్ర వాహనంపై బ్యాంక్ స్ట్రీట్ కి వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రెస్ నందు లేదా సెల్ నెం. 9350103150 నందు సంప్రదించగలరు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగ పరిస్తే చట్టపరంగా నేను తీసుకొను చర్యలకు బాధ్యులకుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

రౌడీషీటర్ల ఆగడాలను కట్టడి చేస్తాం

త్రీ టౌన్ సిఐ ఎస్.సాంబశివరావు

తెనాలి : పట్టణంలో రౌడీ షీటర్ల ఆగడాలను కట్టడి చేస్తామని నూతనంగా త్రీ టౌన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ సాంబశివరావు చెప్పారు. రేంజ్ ఐజి ఉత్తర్వుల మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సిఐ ఎస్ రమేష్ బాబు విఆర్‌కు వెళ్లారు. సిఐ మాట్లాడుతూ 2004లో ఎస్సైగా విధుల్లో చేరి, 2014లో సిఐగా పదోన్నతి పొందినట్లు చెప్పారు. సత్తెనపల్లి, మాచర్ల, రేపల్లె, ఉదయగిరి, వినుకొండ, మెరైన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి, విఆర్ నుంచి తెనాలి వచ్చినట్లు చెప్పారు. స్టేషన్లో పైరవీలకు, దళారీలకు ఆస్కారం లేదన్నారు. బాధితులు ఎవరైనా నేరుగా సంప్రదించవచ్చునన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని, ముఖ్యంగాతెనాలి డీఎస్పీ సహకారంతో సమర్థవంతంగా పనిచేస్తామని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

పగిడిపల్లి విజయ్‌కు సన్మానం

విజయ్‌ను సన్మానిస్తున్న మాలమహానాడు ఉద్యోగులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సీనియర్ పాత్రికేయుడు పగిడిపల్లి విజయ్ పాత్రికేయ రంగంలో ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలను గుర్తించి సెప్టెంబరులో శ్రీశ్రీ కళావేదిక వారు హైదరాబాద్ బిర్లా మందిర్లో జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ నేపథ్యంలో మాచర్ల పట్టణం 25వ వార్డులో ఆదివారం రాత్రి మాల మహానాడు నియోజకవర్గ ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ళ శ్రీనివాసరావు నేతృత్వంలో పట్టణ అధ్యక్షుడు, 25వ వార్డు ఇంచార్జ్ దొడ్డ చంద్రశేఖర్, సంఘ పెద్దలు బొమ్మళ్ల వెంకట్రావు, దార్ల వేణు, చింతమళ్ల అడవి రాముడు, అంజి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారసుడు తమ సోదరుడు పగిడిపల్లి విజయ్ జాతీయస్థాయిలో పురస్కారం అందుకోవడం తమ జాతికి ఎంతో గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘీయులు బుట్టి మారుతి, దొడ్డ కష్ణ, చింతమల్ల శ్రీనివాసరావు, నరేష్, వెంకటేష్, పగిడిపల్లి పున్నారావు, కొమ్ము విజయ్, దాసరి ముక్కంటి, సవరయ్య, రఘు, ప్రసాద్, వేముల ధనలక్ష్మి, మందుల విజయలక్ష్మి, దాసరి శిరీష, దొడ్డ రమణ ఉన్నారు.

టెండరు ప్రకటన

పల్నాడుజిల్లా, బెల్లంకొండ గ్రామం మరియు మండలం నందు గల శ్రీ కోదండరామస్వామి దేవస్థానం మరియు శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంల యందు జీవద్వజములు ఏర్పాటు పనులకు రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనులకు గాను టెండరు షెడ్యూల్స్‌ను ది. 14-10-2025 నుండి 29-10-2025 సాయంత్రం 4-00 గం.ల వరకు దేవస్థానం కార్యాలయం నందు పొందవచ్చును. టెండరు దరఖాస్తుతో పాటు టెండరు ధరావత్తు పైకము డి.డి. గాని నగదు గాని చెల్లించి రశీదును పొంది ఇందుతో జతపరచవలెను. పూర్తి చేసిన టెండర్లు ది. 30-10-2025 ఉదయం 12-00 గం.ల వరకు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 4-00 గం.లకు సీల్డు టెండర్లను కార్యనిర్వహణాధికారి వారిచే తెరువబడును. పూర్తి వివరముల కొరకు బెల్లంకొండ దేవాదాయశాఖ కార్యాలయం నందు పని దినములలో సంప్రదించగలరు.

పనిపేరు	అంచనావిలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూల్ ఖరీదు	పని పూర్తిచేయు కాలము
1) జీవ ధ్వజము ఏర్పాటు	రూ.5,00,000/-	రూ.500/-	రూ.5000/-	1 నెల
2) జీవ ధ్వజము ఏర్పాటు	రూ.5,00,000/-	రూ.500/-	రూ.5000/-	1 నెల

తేది : 14-10-2025

ఇట్లు
కార్యనిర్వహణాధికారి

గౌరవనీయ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం ముందు

గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవన్, సాయిబాబా వీధి,
దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.

ఓ.ఏ. 877/2025

బ్యాంక్ ఆఫ్ బరోడా, అరండల్‌పేట బ్రాంచి, గుంటూరు జిల్లా, ప్రాతినిధ్యం వహిస్తున్న పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ ...దరఖాస్తుదారు బ్యాంక్

మరియు

మెస్సర్స్ శ్రీ వినాయక ట్రేడర్స్ మరియు ఇతరులు ...డిఫెండెంట్లు

మెస్సర్స్ శ్రీ వినాయక ట్రేడర్స్, ప్రొప్రయిటర్ శ్రీమతి కోటేశ్వరమ్మ ప్రత్తిపాటి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్నారు, ఫ్లాట్ నెం.302, అభ్యాశ్రీ అపార్ట్‌మెంట్, ఎస్.వి.ఎన్. కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006. పాన్ నెం: BLLPK0502J. **...(1వ ప్రతివాది)**

శ్రీమతి ప్రత్తిపాటి కోటేశ్వరమ్మ, భర్త: వెంకటేశ్వర్లు, వయస్సు 65 సంవత్సరాలు, డోర్ నెం. 5-89-14, లక్ష్మీపురం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007. పాన్ నెం: BLLPK0502J. **...(2వ ప్రతివాది)**

1వ మరియు 2వ ప్రతివాదులకి పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు జారీ చేయుటకు ప్రత్యామ్నాయ సర్వీస్.

దరఖాస్తుదారు బ్యాంక్ మీపై ఋణాల రికవరీతో పాటు ప్రస్తుత మరియు భవిష్యత్తు వడ్డీ మరియు ఇతర ఉపశమనాల రికవరీ కోసం, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థలకు చెల్లించవలసిన ఋణాల రికవరీ చట్టం, 1993 లోని సెక్షన్ 19 క్రింద ఈ ట్రిబ్యునల్‌లో దరఖాస్తును దాఖలు చేసింది.

ఈ దావాకు సమాధానం ఇవ్వడానికి మీరు **ది.30.10.2025 నాడు ఉదయం 10.30** గంటలకు లేదా ఆ తరువాత ట్రిబ్యునల్ సౌలభ్యం ప్రకారం వెంటనే ట్రిబ్యునల్ ముందు హాజరై, లిఖితపూర్వక వాంగ్మూలాన్ని దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా మీకు సమన్లు జారీ చేయడమైనది.

మీరు ఏవైనా డాక్యుమెంట్లలను దాఖలు చేయదలిస్తే, మీరు వాటిని లిఖితపూర్వక వాంగ్మూలంతో పాటు ఒక జాబితాతో దాఖలు చేయవచ్చు.

మీరు వ్యక్తిగతంగా లేదా న్యాయవాది/ప్లీడర్ ద్వారా ట్రిబ్యునల్ ముందు హాజరైనప్పుడు, మీ రిజిస్టర్డ్ చిరునామాను మరియు హాజరు మెమోను తప్పనిసరిగా దాఖలు చేయాలి.

పై పేర్కొన్న రోజున మీరు హాజరుకావడంలో విఫలమైతే, మీరు లేకుండానే విచారణ జరిపి తీర్పు ఇవ్వబడుతుందని గమనించగలరు.

నా చేతుల మీదగా మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో ది.18.09.2025 తేదీన ఇవ్వబడింది.

సమన్లు జారీ చేసే అధికారం
అధీకృత అధికారి సంతకం

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 297/2024

దూదేకుల హసీనా బేగం .. వాది

వర్సస్

కేశవాగ్నుల నాగముని శివరావు దీక్షితులు ..ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

కేశవాగ్నుల నాగముని శివరావు దీక్షితులు
తండ్రి లేట్ చెంచు సుబ్బయ్య,హిందూ,
వ్యవసాయం, వయస్సు 45 సం.లు,
హౌస్ నెం: 4.5.31/సి, 1వ లైను,
గుంటూరు టౌన్ మరియు గుంటూరు జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది మీ నుండి పరిహారం రాగోరి పైనెంబరు దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 31-10-2025వ తేదీ వాయిదా వున్నది. కావున మీరు వాయిదా రోజు ఉదయం గం.10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
శ్రీ పి.యన్.శేషశయనారెడ్డి,
శ్రీ యం.రంగారెడ్డి,
అడ్వకేట్స్, గిద్దలూరు.

ఇళ్ల పట్టాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో పేదల ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని సుందరయ్య నగర్, వికలాంగుల కాలనీలలో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండు కాలనీల ప్రజలు సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 25 ఏళ్లుగా రెండు కాలనీల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలివ్వకుండా ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయని విమర్శించారు. వర్షం వస్తే ఇళ్లల్లోకి నీరు వస్తూ పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, అయినా ప్రభుత్వాల్లో చలనం లేదని, మౌలిక వసతులు కల్పించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీలో డ్రెయినేజీ కాల్వలు, సిసి రోడ్లు నిర్మించాలన్నారు. రాత్రి వేళ చీకట్లో మగ్గాల్సి వస్తోందని, ఇంటింటికీ విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రం లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రేషన్ తీసుకోవాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, ఈ ప్రాంతంలోనే రేషన్ షాపు పెట్టాలని డిమాండ్ చేశారు. వికలాంగుల కాలనీలో ఇంటింటికి కుళాయి లేక వికలాంగులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సిపిఎం మండల కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమస్యలను సత్వరం పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ఎం.రామకృష్ణ, టి.గంగాధరరావు, శారమ్మ, అలివేలమ్మ, గాలేమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

12వ వార్డులో సమస్యలు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని 12వ వార్డ్డలో సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం విన్నవించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లూథరన్ చర్చి పక్కనున్న 90 సెంట్ల మురుకు కుంట నుండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, విషపురుగులకు నిలయమైందని చెప్పారు. దీనిపై కొన్నేళ్లుగా విన్నవిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ చెరువును పూడ్చి కళ్యాణమండం లేదా, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తపల్లెలో తాగునీటి సమస్య ఉందని, ట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తున్నారని, పైపులైను ఏర్పాటు చేయాలని కోరారు. అంబేద్కర్ కాలనీలో పార్కును నిర్మిం చాలని, చంద్రమౌళి పార్క్ వెనక నుంచి చార్లెస్ కాన్వెంట్ వరకు పెదనందిపాడు రోడ్డుకు సిమెంటు రోడ్డు వేసి ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు, వీధి లైట్లు వేయాలని కోరారు. విద్యుత్ వినియోగదార్లకు చెప్పకుండా, అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను పెట్టొద్దని విద్యుత్ ఎఇ లావణ్యకు వినియోగదార్లతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనుమతి లేకుండా పెడుతుంటే తమ దృష్టికి తేవాలని ఎఇ సూచించారు. కార్యక్రమంలో టి.ప్రతాపరెడ్డి, ఎస్.బాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఏడుగురు కార్మికుల తొలగింపు

విధుల్లోకి తీసుకోవడంతోపాటు వేతన, పిఎఫ్ బకాయిల కోసం ధర్నా - డిపోమేనేజర్ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక ఆర్‌టిసి డిపోలో అక్రమంగా తొలగించిన వాషింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఏడుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డిపో ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ధర్నా చేశారు. ఏపిఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరామ్ మాట్లాడుతూ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవడంతోపాటు వారికి నాలుగేళ్ల నుండి రావాల్సిన పెరిగిన వేతన బకాయిలు, ఆర్టీసి మేనేజ్‌మెంట్ కట్టిన పిఫ్ డబ్బులు, కార్మికుల నుండి రికవరి చేసిన పిఫ్ డబ్బులు సంవత్సరానికి 8.5 శాతం వడ్డీ డబ్బులు, వారాంతపు సెలవులో పనిచేసిన రోజులకు జీతం, ఇఎస్‌ఐకి కార్మికులు, ఆర్టీసీ మేనేజ్‌మెంట్ కట్టిన డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ మేనేజర్‌తో చర్చలు జరిపారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టర్ సెప్టెంబర్ 17వ తేదీన లెటర్ రాసి ఇచ్చినప్పటికీ, కాంట్రాక్టర్ వస్తేనే వీధిలోకి తీసుకుంటానని మేనేజర్ సాకులు చెప్తున్నారని, తనకు సంబంధం లేదని, కాంట్రాక్టుతో మాట్లాడుకోవాలని అనడం సరికాదని విమర్శించారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా వ్యవహరించాల్సిన ఉండగా కాంట్రాక్టర్‌కు వత్తాసు పలకడం ఏమిటని నిలదీశారు. ఒక్కొక్క కార్మికులకు నెలకు పిఎఫ్, ఇస్‌ఐతో సహా రూ.12,382 రావాల్సి ఉండగా రూ.9 వేలు మాత్రమే ఇచ్చేవారని, పిఎఫ్ ఖాతాలు ఓపెన్ చేయకుండా వారికి రావాల్సిన పిఎఫ్ డబ్బులు, ఇఎస్ఐ అదేవిధంగా వీక్లీ హాలిడేస్ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయని ప్రశ్నించారు. దీనిపై డిపో మేనేజర్ వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి చర్చలు జరిపి బకాయిలు ఇప్పించాలని కోరారు. లేకుంటే దశలవారీగా ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు, కార్మికులు ఎల్.మరియమ్మ, జి.మాణిక్యం, డి.ఉమా, ఎం.మరియమ్మ, సైదమ్మ పాల్గొన్నారు.

భూ యజమానితో సంబంధం లేకుండా కౌల్దార్లకు కార్డులివ్వాలి

అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు కౌలురైతులకే ఇవ్వాలని వినతులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వడంతోపాటు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట కౌలురైతులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ నూతన కౌలురైతు చట్టాన్ని తెస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చిన కూటమి ఇప్పటికీ తేలేదన్నారు. పాత కౌలు దారి చట్టంలో లోపలున్నాయని, దాన్ని సవరించి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటించి 18 నెలలు కావస్తున్నా చర్యలు మాత్రం లేవన్నారు. వ్యవసాయంలో ఎక్కువ భాగం కౌలురైతులే సాగుచేస్తున్నారని, కౌల్దారుల్లో అధికంగా బడుగు బలహీన వర్గాలవారేనని తెలిపారు. వీరంతా పెట్టుబడి కోసం ధనికుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడుతున్నారని, ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 పెట్టుబడి సాయంతోపాటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కెఎస్.చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘం మండల కార్యదర్శి పి.మహేష్, అధ్యక్షులు సిహెచ్.లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు ఎం.నరసింహారావు, పూర్ణయ్య, కౌలు రైతులు బుల్లయ్య, బి.రామారావు, ఎం.నాగార్జున, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

కౌల్దార్లకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు కోసం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ టి.కొండారెడ్డికి సోమవారం విన్నవించారు. సంఘం మండల అధ్యక్షులు జి.పిచ్చారావు మాట్లాడుతూ ఈ-క్రాప్, పంటల బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, షేక్ మస్తాన్‌వలి, జి.కుమారి, వి.ఈశ్వరయ్య, జి.వెంకటరమణ, ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ అభినందన

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని యుటిఎఫ్ మండల అధ్యక్షులు షేక్. నజీర్, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరుతున్న నూతన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయలను నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. విధుల్లో ఎమైనా అటంకాలు, ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.నాయకులు కేశవరెడ్డి, ముస్తఫా, కబీర్ పాల్గొన్నారు.

రూ.20 వేలు వస్తాయంటే నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - మాచర్ల : నేషనల్ ఫ్యామిలీ బెన్ఫిట్ స్కీమ్ (ఎన్ఎఫ్ బిఎస్) కింద ప్రభుత్వం వితంతువులకు రూ.20 వేల ఆర్థిక సహాయంగా వస్తాయని చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని తహశీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. వితంతువులను దళారులు నమ్మబలికి, ఫారం పూర్తి చేసి, తహశీల్దార్ కార్యాలయంలో ఇచ్చి దగ్గరుండి మీకు నగదు వచ్చేలా చేస్తామంటూ రూ.500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందిన్నారు. స్కీమ్ గురించి ప్రభుత్వం నుంచి ఆదేశాలేమీ లేవన్నారు. ఇదిలా ఉండగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 3 అర్జీలొచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు, ఇతర రెవెన్యూ సమస్యలుంటే నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్వో నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ : విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన అండర్-19 ఎస్‌జిఎఫ్ఐ క్రికెట్ ఎంపికల్లో మండలంలోని చీగటిగలపాలెం ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు పి.ఆకాశ్, ఎ.మహేష్‌బాబు ప్రతిభ చూపి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో స్థానం సాధించారని ప్రిన్సిపాల్ వి.పద్మావతి సోమవారం తెలిపారు. నరసరావుపేట డివిజనల్ స్థాయి చెస్‌లోనూ తమ విద్యార్థులు కె.చతురాసాయి వై.అనంతేష్, కబడ్డీలో కె.సుకన్య ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైనవారితోపాటు పీడీ వి.చినపాపారావును ప్రిన్సిపాల్, ఇన్‌ఛార్జి కాసింపీరా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ ఉపయుక్తం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ : మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుచే ఉచితంగా అందించబడిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ప్రయోజకరమని మండల విద్యాశాఖ అధికారి అల్లి సురేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో యూటిఎఫ్ నాయకులతో కలసి స్టడీ మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహించి, ఎంపికైన వారికి రూ.12వేలు స్కాలర్షిప్ నాలుగేళ్లపాటు ఇస్తుందని చెప్పారు. ఈ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు కెఎస్ లక్ష్మణరావు ఉచితంగా అందించే మెటీరియన్‌ను బాగా ప్రాక్టీస్ ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండలం అధ్యక్షులు షేక్. నజీర్, ప్రధానకార్యదర్శి ఆదినారాయణ, కేశవరెడ్డి, ముస్తఫా, కబీర్, విశ్రాంత ఉపాధ్యాయులు కిరీటిరెడ్డి పాల్గొన్నారు.

తెనాలి, పెదనందిపాడు, తాడికొండలో వినతిపత్రాలు అందజేస్తున్న సిపిఎం, కౌలురైతు సంఘ నాయకులు

కౌలు రైతుల సమస్యలు
పరిష్కరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ కౌలు సంఘం, ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలుదారి చట్టాన్ని సవరణ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆచరణలో చట్ట సవరణ చేయకుండా రోగులు రైతులను కౌలు రైతులను మోసం చేసిందని విమర్శించారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు వరదలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం జరిగితే ప్రభుత్వం ఇచ్చే ఎటువంటి సహాయం కూడా కౌలు రైతులకు అందడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్నదాత సుఖీభ , కౌలు రైతులకు అమలు చేయాలని కోరారు. రైతు పండించిన పంటకు గితుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య ,వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి రూరల్ మండల అధ్యక్షులు జి.అజయ్ కుమార్ నాయకులు మేరీ, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు భాస్కర్ రెడ్డి, సిఐటియు మంళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అన్నదాత సుఖీభవ పథకం క్రింద రూ. 20 వేలు తక్షణ పెట్టుబడి సాయం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తెనాలి తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. నష్టపోయిన పంటకు పరిహారం అందించేలా రైతులకు నూతన కౌలు చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన చట్టం దుర్మార్గమైనదని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత మేలు కలిగించే చట్టం తీసుకు వస్తామని చెప్పి 18 నెలలు గడిచాయన్నారు. భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభలు ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రుణాలు ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని గురు చేశారు. కులమతాలకతీతంగా పెట్టుబడి సాయం ఒకే విడతలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ములకా శివకుమారి పాల్గొన్నారు.

ప్రజాశక - పెదనందిపాడు

రైతుల, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటశివరావు మాట్లాడుతూ మండలంలో యూరియా, డిఏపి కొరత తీవ్రంగా ఉందని, అదనుకు ఎరువులు అందించలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సూక్ష్మ పోషకాలు జింకు, జిప్సం, బోరాన్ వంటివి గతంలో ఇచ్చిన విధంగా ఉచితంగా అందజేయాలని కోరారు. సబ్సిడీ మీద వ్యవసాయ పనిముట్లు అవసరమైన వారందరికీ అందించాలని కోరారు. కౌలు రైతులు అందరికీ భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు, ఏలూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడికొండ

కౌలు రైతులు అందరికీ గుర్తింపు కార్డులు అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కర్‌రావు కోరారు. సోమవారం స్థానిక బస్టాండ్ వద్ద, నిరసన చేపట్టారు. అనంతరం ఉపతహ శీల్దార్ కృష్ణకుమారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడికొండ మండలంలోని అన్ని గ్రామాల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి ప్రతి రైతుకు యూరియా సరిపోయినంతగా సరఫరా చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బాణావత్ భద్రయ్య, నీలయ్య, జోషి, అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈమని అప్పారావు

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలో రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సోమవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్‌కు కౌలు రైతు, రైతు వ్యవసాయ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ యజమాని సంతకంతో పని లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని, దేవాలయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు. గుంటూరు ఛానల్, కొండవీటి వాగు, ఇతర కాల్వ కట్టలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని శివాజీ, సంకూరి నీలాంబరం, కోటిపల్లి సత్యనారాయణ, కె.శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులందరికీ వర్తింపజేయాలని స్థానిక తహశీల్దార్ ప్రసాద్‌రావుకి మండల కౌలురైతు సంఘం కార్యదర్శివై నాగేశ్వర రావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలుదార్ గుర్తింపు కార్డులు ఇస్తానని ఎన్నికల ప్రణాళికలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అయినా ఇప్పటికీ 18 నెలలు గడిచిన ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఇంతవరకు కౌలు గుర్తింపు కార్డులు ప్రస్తావనే లేదు. గుర్తింపు కార్డు లేక కౌలు రైతులు వేసిన పైరుకు ఈ క్రాపింగ్ జరగక పోవుట వలన ప్రస్తుత పరిస్థితుల్లో యూరియా కూడా ప్రైవేట్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేయవలసి వస్తుంది.రుణ పరపతి లేక అప్పులలో కూరుకు పోతున్నారు. కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చకపోతే కౌలు రైతులు జగన్ ప్రభుత్వానిఎక్కడ ఉంచారో రేపు టిడిపి ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కనుక వెంటనే ప్రభుత్వ అధికారులతో కౌలు రైతును గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు మార్పుల వెంగళరెడ్డి సిఐటియు కార్యదర్శి షేక్ మస్తాన్ వలి , కె.వెంకటేశ్వర్లు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు మండవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల రూపాయలు కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామ సభలు నిర్వహించి నూతన కౌలు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ పంట రుణాలు పెట్టుబడి సాయం నష్టపరిహారం ఈ క్రాప్ భీమా పంట అమ్ముకోవడం లాంటి సౌకర్యాలు కౌలు రైతులకు కల్పిస్తూ క్రొత్త చట్టం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ ఖాన్, వి.వీరయ్య, డి.బుజ్జి, ఎన్.రాంబాబు, డి.సుబ్బారావు, ఎం.జగన్ మోహన్‌రావు, ఎస్.కె.ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని, ఫిరంగిపురం, దుగ్గిరాలలో వినతిపత్రాలు అందజేస్తున్న సిపిఎం, కౌలురైతు సంఘ నాయకులు

దీక్షల్లో నినాదాలు చేస్తున్న కార్మికులు

314వ రోజుకు చేరుకున్న దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 314రోజుకు చేరుకున్నాయి. దీక్షలను షేక్ సుభాని, పిచ్చయ్య, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు ప్రారంభించారు. దీక్షల్లో వై.రమాదేవి, ఈ. శారమ్మా, వి.రిబ్కా, కె.ఏడుకొండలు, కె.అంకమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో బి.అంకయ్య, ఎం.గురవయ్య, డి.నాగేశ్వరావు, టి.దుర్గాభవాని, డి.నాగమల్లేశ్వరి, వై.నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకణ

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ మేనేజర్ విల్సన్ జయకర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మున్సిపల్ ట్యాప్ తొలగించాలని, హౌస్ హెూల్డ్ మ్యాపింగ్‌లో సవరణలు చేయాలని, వాతావరణ కాలుష్యంపై అర్జీలు స్వీకరించినట్లు ఆయన చెప్పారు. సమావేశంలో మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ ఎ.లక్ష్మీకుమారి అర్జీలు స్వీకరించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరిం చేందుకు సంబంధిత విభాగాల అధికారులకు పంపనున్నట్లు వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

అర్హులకు ఇళ్ల స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి నారా లోకేష్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అర్హులైన వారందరికీ రెండు సెంట్లు స్థలం రాజధాని లో ఇవ్వాలని సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం ఉండవల్లి అమరారెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న వాళ్లకి ఇళ్ల పట్టాలు రెగ్యులేషన్ చేయాలని, ఇంటి స్థలం లేనివారికి రెండు సెంట్లు స్థలం కేటాయించాలని తాడేపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్ సిపిఎం పార్టీ తరపున అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఈమని రామారావు, పార్థసారథి, గాంధీ, శివయ్య పాల్గొన్నారు.

అర్జీలు రాస్తున్న మహిళలు

17న మంగళగిరికి తరలిరండి

ప్రజాశక్తి- తాడేపల్లి

పేదలందరికీ ఇంటి స్థలం ఇస్తానన్న వాగ్దానాన్ని నెరవేర్చాలని సిపిఎం నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఇళ్లస్తలాలు ఇవ్వాని 17న మంగళగిరిలో జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోమవారం నులకపేట ఫారెస్ట్ ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సిపిఎం కార్యకర్తలు ఈరోజు పేదలకు అర్జీలు రాసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేముల దుర్గారావు, లక్ష్మి, ఎం.మల్లేశ్వరి, వి.రమణ, ఎం.శ్రీను, గోపి, భాను, తమ్మిశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో స్కూలు ఛైర్మన్, డైరెక్టర్, ప్రిన్సిపాల్

కె-రిడ్జ్ స్కూల్ విద్యార్థుల ఘనత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మంగళగిరిలో ఈనెల 11న జరిగిన ఏరోస్కాటేబాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సెలెక్షన్స్ ఫర్ నేషనల్ ఛాంపియన్షిప్ - 2025 జాతీయ ఛాంపియన్ షిప్‌కు ఏరోస్కేట్ బాల్ అంతర్ జిల్లా అండర్ 14 గ్రూప్ ఎంపికలో నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కి చెందిన విద్యార్థులు కె. కార్తికేయ, యం. మన్సూర్ పాషా, షేక్. ఇమ్రాన్, పి. కార్తికేయ, మోక్ష రామ్ చరణ్, ఎ. గోపి హర్ష, ఏ. లాస్యంజలి. జి. మధు శ్రీ చందు, ఎన్. మోక్షిత్, ఏ. చైతన్య రామ్, ఎన్. ప్రభు రామ్, కె. సాయి సంప్రీత్ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోట బాపూజీ, విద్యార్థినులను అభినందించారు. కోచ్‌లు ఫిరోజ్ ఖాన్, ఖాజాబీ లను స్కూల్ ఛైర్మన్ నాతాని ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌మెన్ వెంకటేశ్వరరావు

ప్రమాదాల నివారణపై 'ఎంఎఎం'లో అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేసానుపల్లి గ్రామంలోని ఎంఎఎం కళాశాలలో సోమవారం ఇంటర్నేషనల్ డే ఫర్ డిజాస్టర్ రెడ్యూషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్- కళాశాలల ఛైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మాట్లాడుతూ విపత్తు సమయంలో నష్టాన్ని తగ్గించటం వనరులను సమన్వయం చేయటం ప్రణాళిక రూపొందించి విపత్తుని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండటం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు దానిని ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. ఫైర్ మెన్ పెనుమాక వెంకటేశ్వరరావు, సతీష్‌బాబు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ దొండేటి చంద్రారెడ్డి, రామాంజనేయులు, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ గోపి, ఫ్యాకల్టీ స్వాతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి - కారంపూడి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి, గ్రామాలలో ఘన ద్రవవ్యర్థాల నిర్వహణపై రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలియ జేశారు. ఆసిస్ట్ పిఒ రత్నకుమార్ మాట్లాడుతూ పిపిటి పద్ధతి ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ గురించి తెలియజేశారు. రిసోర్స్‌పర్సన్ బొల్లయ్య మాట్లాడుతూ గ్రామాలలో ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి అమ్మడం, ఎరువులు తయారు చేయడం ద్వారా విరివిగా సంపదను సృష్టించవచ్చని తెలియ జేశారు. అనంతరం పోస్టరు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కసిన్యా నాయక్, ఏపీవో వెలుగు రంగారెడ్డి, పిఒ రత్నకుమార్, రిసోర్స్ పర్సన్ బుల్లయ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఏసోబు, పంచాయతీ కార్యదర్శులు వెంక టేశ్వర్లు, సుబ్బారావు, సతీష్, చెన్నకేశవరెడ్డి, సర్పంచులు ఏడుకొండలు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను సత్వరం పరిష్కరించండి

పల్నాడు జిల్లా కలెక్టరు కృతికా శుక్ల

సమస్యలు వింటున్న కలెక్టర్ కృతిక శుక్లా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టరు, జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి స్వీకరించారు. 152 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని, అర్జీలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో నాలుగేళ్ల కిందట నాడు-నేడు పథకం కింద ఉర్దూ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం చేపట్టారని నిధుల లేమితో ఆగిపోయిందని పాఠశాల అందుబాటు లోకి తెస్తే 700లకు పైగా ఉన్న ముస్లిం మైనారిటీ కుటుం బాలకు చెందిన విద్యార్థులకు మేలు జరుగుతుందని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

క్రోసూరు పంచాయతీ పరిధిలోని ఎర్రబాలెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించిసమస్యలు పరిష్కరించాలని ఎర్రబాలెం గ్రామ ప్రత్యేక పంచాయతీ సాధనా కమిటీ ఆధ్వర్యంలో సోమ వారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.

అనధికార నిర్మాణాలు తొలగించండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డు, 60 అడుగుల రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలు, జూపల్లి స్పైసెస్ ఆక్రమణ తొలగించాలని కోరుతూ సోమవారం స్పందనలో జనసేన నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. జనసేన పట్టణ అధికార ప్రతినిధి షేక్.అద్రుఫ్ మాట్లాడుతూ ఆర్అండ్‌బి స్థలాలు, డ్రైనేజీలపై ఆక్రమణతో వినుకొండ రోడ్డులో ట్రాఫిక్ పెరిగిందన్నారు.

హాస్టళ్లలో కనీస వసతులు తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల్లో భోజనం, తాగు నీరు, వసతి, ప్రథమ చికిత్స, పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంరంక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డయేరియా, వివిధ రకాల జ్వరాలు నమోదైతే ఎలా స్పందించాలో తెలుపుతూ మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. కాచి వడగట్టిన నీటిని మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచి ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతి వసతి గృహంలో తాగు నీటి పరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పించాలని తెలిపారు. బయటి ఆహార పదార్థాలను నిషేధించాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. 10 వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ ఎల్. చంద్రకళ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డిపిఒ నాగేశ్వరనాయక్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాబందుల శాంతియాత్రల్లా వైసిపి ధర్నాలు : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

కల్తీ మద్యం పేరిట రాష్ట్రంలో వైసీపీ చేపట్టిన ధర్నాలు రాబందుల శాంతియాత్రలను తలపిస్తున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యం అంటూ వైసీపీ చేస్తున్న విమర్శలు, పోరుబాటపై ఈమేరకు ఆయన స్పందించారు. వైసీపీ మద్యం అక్రమాలపై ముందుంది మొసళ్ల పండగని హెచ్చరించారు. సిట్ తర్వాత ఇప్పటికే ఈడీ రంగప్రవేశం చేసిందని, వైసీపీ కోరుకుంటున్నట్లుగా సీబీఐ కూడా రావడం, వాళ్లనే జైలు లోకి నెట్టడం ఖాయమన్నారు. కల్తీ మద్యం కేసులో నిందితుడు జనార్దన్‌రావు చెప్పిన దాని ప్రకారం కల్తీ మద్యం తయారు జరిగింది వైసీపీ హయాంలోనే, దాని వల్ల లబ్ధి పొందింది కూడా ఆ పార్టీ నాయకుడు జోగి రమేష్ అని చెప్పినా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అసలు విషయం ఏంటంటే కల్తీ మద్యం కేసులో నేడో రేపో జగన్‌రెడ్డి అరెస్టు ఖాయమని, అది సిట్ చేస్తుందా? ఈడీ చేస్తుందా? సీబీఐ చేస్తుందా రాష్ట్ర ప్రజలే చూస్తారన్నారు. ఈలోపు సానుభూతి కోసం అరెస్టును ఆలస్యం చేయడం కోసం చిల్లర నాటకాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 90 రూపాయలు ఉన్న మద్యం సీసాను రూ.300కి అమ్ముకున్న బొల్లా బ్రహ్మ నాయుడు కూడా దీనిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వినుకొండ నియోజకవర్గంలో బెల్టు షాపులతో సమాంతర మద్యం వ్యవస్థను నడిపించింది బొల్లా బ్రహ్మానాయుడు కాదా అని ప్రశ్నించారు. సరఫరా చేసిన కల్తీ మద్యం మీద కూడా సీసాకు ఇంత అంటూ బీ ట్యాక్స్ వసూలు చేసిన విషయాన్ని మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

బాణసంచా కూలీల ప్రాణాలకేదీ రక్షణ?

రూ.కోటి బీమా సౌకర్యం కల్పించండి : సిఐటియు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బాణాసంచా కేంద్రాల వద్ద నిప్పుతో చెలగాటమని తెలిసినా పొట్ట కూటి కోసం ప్రాణాలు తెగించి కూలీలు పనులు చేస్తున్నారు. కూలి చేసే వారికి కనీసం బాణా సంచా వ్యాపార సంస్థల యజమానులు వ్యాపారమే ధ్యేయంగా వారికి కనీసం బీమా సౌకర్యం కల్పించడం లేదు. వారి జీవితాలకు రక్షణ లేదు. ప్రమాదం జరిగినప్పుడు భారీగా స్పందించే నాయకులు, అధికారులు, కూలీలకు నిబంధనలు ప్రకారం పని చేస్తున్నారా? లేదా.. అనే విషయాన్ని కనీసం పరిశీలన చేయకపోవడం దురదృష్టకరం. వారి చేత పనులు చేయించుకుంటూ కొద్దిపాటి, భారీ ప్రమాదాలు జరిగితే వారిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోక పోవటం అన్యాయమంటున్నారు. చిలకలూరిపేట పట్టణం నుంచి అనేక రాష్ట్రాలకు, రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు ఇక్కడ నుంచే బాణా సంచా సరఫరా చేస్తుంటారు. ముఖ్యంగా పట్టణంలోనే రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. బాణా సంచా వ్యాపారం చేసే సంస్థలలో ప్రదానంగా ఎగుమతి చేసే సంస్థలు మూడు, నాలుగుగా ఒక మాదిరి సంస్థలు 15, 20 గాను, చిన్నాచితక సంస్థలు పండుగ ముందు రెండు మూడు రోజులు నుంచే తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారు వందల సంఖ్యలో ఉన్నారు. గోదాముల్లో, బాణాసంచాషాపుల్లో పనులు చేసే 800 నుంచి 1000 మంది దాకా ఉన్నారు. వీరిలో దాదాపు బీమా సౌకర్యం కలిగిన వారు లేరు. కాబట్టి ఇప్పటికైనా వ్యాపార సంస్థలల్లో పనిచేసే వారికి బీమా సౌకర్యం కల్పించే విధంగా సంస్థ యజమానులు అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగినపుడు నివారించే పరికరాలు ప్రతి బాణసంచా కేంద్రం వద్ద ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సిఐటియు మండల కార్యదర్శి పెరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి కూలికి రూ. కోటి బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో నూతన కమిటీ సభ్యులు

గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసూరు శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రంథాలయ అధికారిని వై.వీరాంజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హిందీ ఉపాధ్యాయులు ఎస్.ఎం సుభాని, ఉపాధ్యాయిని పి పద్మావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం ప్రాముఖ్యత గురించి తెలియజేసి వాటి అభివృద్ధికి నూతన కమిటీ పాటుపడాలని కోరారు. అనంతరం బండారు మైసూర్‌బాబు పేరు అధ్యక్షుడిగా మన్యం సాంబశివరావు ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కమిటీ ఉపాధ్యక్షునిగా ఎస్ఎం సుభాని, సెక్రటరీగా శ్రీరామ్ రాజేశ్వరరావు, జాయింట్ సెక్ర టరీగా మన్నెం సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. అనంతరం బండారు మైసూర్‌బాబు అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రంథాలయం ప్రవేశ ద్వారం వద్ద మెట్లు నిర్మాణం, పాఠకుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఆమోదించారు.

మండలానికి 22 ఉపాధ్యాయ పోస్టులు

ప్రజాశక్తి - క్రోసూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో క్రోసూరు మండలంనకు మొత్తం 22 మంది ఉపాధ్యాయ పోస్టులను కేటాయించారని ఎంఈఓ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎస్జిటీ పోస్ట్ హసనాబాద్ ఎంపీ యు పి స్కూళ్లకు కేటాయించగా జిల్లాలో ఆరవ ర్యాంకు సాధించిన సుకన్య ఈ స్థానంలో ఎంపికయ్యారు. మిగిలిన 21 ఉపాధ్యాయ ఖాళీలు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు చెందినవని తెలిపారు. మండలానికి కేటాయించిన ఉపాధ్యాయులందరూ ఆయా పాఠశాలల్లో సోమవారం విధులలో చేరినట్లు తెలిపారు. సోమవారం విధులలో చేరిన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారులు ఎంఈఓ-1 కృష్ణ ఎంఈఓ-2 ఎం.గణేష్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఇతర జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలియ జేస్తూ విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని మండలానికి ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని సూచించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను సోమవారం టీడీపీ నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం కాజ గ్రామంలో అర్ధల సాంబశివరావుకి రూ 45వేలు, మాణిక్యాల శ్రీలక్ష్మికి రూ. 20వేల విలువైన చెక్కులను అందజేశారు. మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి,మాణిక్యాల రవి, కుక్కమళ్ళ విక్రమ్ బాబు, అర్ధల గోపి రాజు, చింకా కోటేశ్వరరావు, ఆర్ల పున్నయ్య, పల్లబోతుల శివసాయి కుమార్ పాల్గొన్నారు

బీసీ-డిలుగా గుర్తించాలని వినతి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని 1వ వార్డు వెన్నపూస కాలనీ, మండలంలోని కొండ కింద ఉప్పరపాలెం గ్రామంలో నివాసముంటున్న వారికి యాదవ సామాజిక తరగతి సర్టిఫికెట్ బిసి (డి) మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కొప్పరపు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోమవారం వినుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీరంతా వృత్తిరీత్యా గంగిరెద్దులాడించుకునే వారనీ, కాలక్రమైన గంగిరెద్దులు అంతరించిపోవడంతో గ్యాస్‌పొయ్యి మరమ్మత్తులు, గ్రామాల్లో ఆకుకూరలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. నల్లబోతుల, పోలిబోయిన, తిరుమల వంటి ఇంటిపేర్లు ఉన్న వారందరూ ఎర్రగొండపాలెం, సత్తెనపల్లి, బెల్లంకొండ, త్రిపురాం తకం మండలాల్లో యాదవ కులస్తులుగా బిసి (డి) కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉన్నారని వాటి ఆధారంగా విచారించి వీరికి యాదవ కులస్తులుగా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వినుకొండ తహశీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిన్నబోడిన వెంకటేశ్వర్లు, వందనం, మస్తాన్వలి, వెంకటే శ్వర్లు, తిరుమల శ్రీను, నల్లబోతుల శ్రీను, లాజర్, దుర్గ పాల్గొన్నారు.

తెనాలి రోడ్డు విస్తరణ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని తెనాలిరోడ్డు విస్తరణ నిర్వాసితులు కొత్త రామాలయం వద్ద నుండి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు సోమవారం శాంతియుత ప్రజా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెనాలి రోడ్డు నిర్వాసితులు, సీనియర్ సిటిజన్స్, చేనేత వ్యాపారులు, షాపు అద్దెదారులు, ధార్మిక సంఘాలు, కార్మికులు పాల్గొన్నారు. మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెనాలి రోడ్డు చేనేత పరిరక్షణ మరియు విస్తరణ బాధితుల సంఘం కన్వీనర్ జొన్నాదుల గురుమోహనరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆగస్టు 28వ తేదీన వెలువడిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెనాలి రోడ్డును 60 అడుగులకు విస్తరించే ప్రతిపాదన ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించి తీసుకున్న నిర్ణయం అన్నారు. ఈ సంవత్సరం జూలై ఆరవ తేదీన మున్సిపల్

ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వాసితులు

అధికారులు నిర్వహించిన అవగాహన సమావేశంలోనే తెనాలి రోడ్డు నిర్వాసితులు, ధార్మిక సంఘాలు, చేనేత వ్యాపారులు తెనాలి రోడ్డు విస్తరణకు వ్యతిరేకంగా స్పష్టంగా తమ అభిప్రాయాన్ని తెలిపామని అన్నారు. ఆ తర్వాత అనేక సార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ గెజిట్ విడుదల చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తెనాలి రోడ్డులో శతాబ్దాలుగా నివసిస్తున్న వందలాది కుటుంబాలు, చేనేత వ్యాపారులు ఈ విస్తరణ ప్రణాళికతో ఇళ్లు, దుకాణాలు కోల్పోయి పూర్తిగా నిరాశ్రయులవుతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం ఖబరస్తాన్ ఉందని, ఇది మత సామరస్యానికి ప్రతీక అని, ఆ భూమిని రోడ్డు విస్తరణలో భాగం చేయడం మత విశ్వాసాలను దెబ్బతీస్తుందని తెలిపారు. ఆ పవిత్ర స్థలాన్ని కాపాడాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను వినతిపత్రంలో కోరారు. మునిసిపల్ కమిషనర్‌కు యిచ్చిన వినతిపత్రంలో గెజిట్ నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకోవాలని, 60 అడుగుల రోడ్ విస్తరణ ప్రతిపాదనను రద్దు చెయ్యాలని, ఎవరూ ఇళ్లు కోల్పోకుండా, జీవనోపాధి నష్టపోకుండా తెనాలిరోడ్డు ప్రజల అభిప్రాయంతో కూడిన సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం కేసు సిబిఐకి అప్పగించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో జరిగిన నకిలీ మద్యం కేసును సిబిఐకి అప్పగించాలి బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నకిలీ మద్యం కేసులో చంద్రబాబు స్నేహితుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు జయచంద్ర రెడ్డి సూత్రధారని అన్నారు. నకిలీ మద్యంతో ప్రజల జీవితాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెలగాటమాడుతున్నారని ఎద్దేవా చేశారు.. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరికట్టలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి గత ప్రభుత్వం కంటే పెరిగిపోయిందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాల విఫలమైందని విమర్శించారు. బీసీల అభివఅద్ధికి చంద్రబాబు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు.

రేపు తేళ్ల నారాయణ వర్ధంతి

ప్రజాశక్తి - పెదనందిపాడు

నారాయణ (ఫైల్)

బుధవారం స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ తేళ్ల నారాయణ తృతీయ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారాయణ వర్ధంతి సందర్భంగా ట్రంప్ సుంకాలు - భారత్ పై ప్రభావం అనే అంశంపై జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ పాశం రామారావు, స్థానిక నాయకులు హాజరవుతారని తెలిపారు. బుధవారం జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొన్నారు. జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చేబ్రోలు

అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆర్థిక సాయం అందజేశారు. తోట్లపాలెంకు చెందిన రవికుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తెనాలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందాడు. ఈయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గుడిపూడి అశోక్, అత్తోట నవీన్, ముప్వా రాంబాబు మాజీ ఎంపీటీసీ కోడూరి మోహన్ రావు సోపాటి సాల్మన్ రాజ్ ఎటివరపు చిన్న సుబ్బారావు, కార్యకర్తలు మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రాణాలు పోయే దాకా స్పందించరా..!

ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణంలోని 23వ వార్డు అంబేద్కర్ కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాద భరితంగా మారింది. స్తంభం ఒరిగిపోయి విద్యుత్ ఫీడర్లు పగిలిపోయి తీగలు తెగి కింద పడే విధంగా ఉన్నాయి. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు గత నెలలో ఫిర్యాదు చేస్తే వచ్చి చూసి వెళ్లారు కానీ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. అకాల వర్షాల గాలులకు తీగల తెగిపడితే ప్రాణాలకు ముప్పు వాటిల్లు తుందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

స్కేటింగ్‌లో సెయింట్ జోసఫ్ విద్యార్థుల ప్రతిభ

గెలుపొందిన విద్యార్థులతో సిస్టర్ డాక్టర్ సంధ్యారాణి

ప్రజాశక్తి - పెదకాకాని

స్కేటింగ్ పోటీల్లో స్థానిక సెయింట్ జోసఫ్ సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు గెలుపొందారని ప్రధాన ఉపాధ్యాయురాలు సిస్టర్ డాక్టర్ సంధ్యారాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సంధ్యారాణి విలేకరులతో మాట్లాడుతూ అమరావతి రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా 20 రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలు మంగళగిరిలో నిర్వహించగా పాఠశాల విద్యార్థులు బి.శ్యాం ప్రవీణ్, కుర్ర చరణ్జిత్, రోనివర్ధన్ వివిధ విభాగాలలో బహుమతులను గెలుచుకొని సెయింట్ జోసెఫ్ పాఠశాల సత్తాను చాటారు అన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ప్రపంచ బ్యాంకు సభ్యులు

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రజలను వ్యాధులు వాటి నివారణ పట్ల అవగాహన కల్పించాలని ప్రపంచ బ్యాంకు సభ్యులు సూచించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య పరికరాలు ల్యాబ్ ఎక్రే జనరల్ వార్డు ఓపి గదులు తదితరాలను వారు పరిశీలించారు. తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై రోగులను అవగాహన కల్పించాలని వారు కోరారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందాన్ని డాక్టర్ ఫిరోజ్ ఖాన్ సాదరంగా ఆహ్వానించి, వైద్య

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రపంచబ్యాంకు బృందం

వివరాలను అందజేశారు. నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి అవార్డు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లా రామన్ మృతి తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

కొల్లా రామన్ (ఫైల్)

నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రామన్(59) మృతి తీరని లోటు అని సిపిఎం నాయకులు కొనియాడారు. సోమవారం ఉదయం కొల్లా రామన్ అనారోగ్య కారణంతో మృతి చెందారు. మృతి వార్త విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు పెదనందిపాడులోని ఆయన నివాసం వద్దకు వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాలులర్పించారు. సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, కాపు వెంకట సుబ్బారావు, పసుపులేటి శేషగిరిరావులు నివాళు లర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ కొల్లా రామన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని తెలిపారు. నల్లమడ రైతు సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు అని తెలిపారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. వారి మఅతికి సిపిఎం మండల కమిటీ తరపున సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళు లర్పించిన వారిలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మానుకొండ ఉపేంద్ర, మంచి పుస్తకం నిర్వాహకులు కాపు శ్రీనివాస్‌లు ఉన్నారు.

ఉపాధ్యాయులను అభినందిస్తున్న నాయకులు

నూతన ఉపాధ్యాయులకు అభినందన

ప్రజాశక్తి - పొన్నూరు

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ 2025లో ఉత్తీర్ణులై ఉపాధ్యాయ వఅత్తిలో అడుగుపెడుతున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఏపిటి ఎఫ్ పొన్నూరు శాఖ అభినందనలు తెలిపారు. స్థానిక శ్రీరామ మున్సిపల్ ఉన్నత పాఠశాల నందు సోమవారం నూతనంగా విధుల్లో చేరిన 15 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మరియు మండల శాఖల ఆధ్వర్యంలో వారిని ఘనంగా స్వాగతం పలికారు.

బిజెపికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి - దుగ్గిరాల

బీహార్‌లో బిజెపి దొంగ ఓట్లతో గెలిచినందుకు నిరసనగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన వోట్ చో ర్ గద్దె చోడ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దుగ్గిరాలలో నిరసన ర్యాలీ నిర్వహించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గం పార్టీ అధ్యక్షులు షేక్ సలీం మాట్లాడుతూ అబద్ధాలు చెప్పి దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్కే ముని మండల అధ్యక్షులు నెమలి కంటి ఆదెమ్మ ఎన్ ప్రసాదరావు ఆర్ హనుమంతరావు కఅష్ణ చౌదరి ఆర్ వెంకటస్వామి బుల్ల సమర్పన్ కుమార్ రత్న గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రాయపూడిలో..

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని రాయపూడిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ తిరిగి సోమవారం సంతకాలు సేకరించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్‌తో కలిసి బిజెపి దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి ఎలా పాల్పడిందో రాహుల్ గాంధీ సవివరంగా చెప్పారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అడుసుమల్లి శ్రీనివాస్, బాల మంచ్ రాష్ట్ర అధ్యక్షులు బొర్రా రవిచంద్ర, వెలగలేటి కోటేశ్వరరావు,షేక్ నాగుల్ మీరా, రెమిడిశెట్టి హనుమంత రావు,షేక్ మున్నీ పాల్గొన్నారు.

కోటి సంతకాలసేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పొన్నూరు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో సోమవారం సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నటు వంటి మెడికల్ కాలేజీలను ప్రస్తుతం అధికారంలో రాగానే కూటమి ప్రభుత్వం ప్రవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రజలను దగా, మోసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఒకే యాప్‌లో అన్ని పంచాయతీ సేవలు

ప్రజాశక్తి - కొల్లిపర

పంచాయతీ కార్యాలయం అందించే అన్ని సేవలు ఒకే యాప్‌లో వినియోగించవచ్చని ఎంపీడీవో విజయలక్ష్మి సోమవారం తెలిపారు ప్రభుత్వం నూతనంగా రూపొందించిన యాప్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కొల్లిపర గ్రామపంచాయతీ మంచినీటి వాటర్ ట్యాంకు నీటి నమూనలను సేకరించి పరిశుభ్రతను పరిశీలించి యాప్‌లో పొందుపరిచారు ఈ పరిశీలన కార్యక్రమంలో తాడేపల్లి పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ సాయిలహరి, టీమ్ మెంబర్స్ నాగేంద్ర రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ , పంచాయతీ కార్యదర్శి అలకనంద పాల్గొన్నారు.

వర్సిటీ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో జూలై నెలలో జరిగిన ఎంఎస్సీ కెమిస్ట్రీ రెండవ సెమిస్టర్, డిప్లమా ఇన్ ఫోటోగ్రఫీ రెండవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ కొరకు ఈనెల 23వ తేదీలోపు ఒక్కొక్క పేపర్ కు రూ.1860 లు చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

న్యాయవాద కోర్సుల పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఆఫ్ లా (ఎల్ ఎల్ ఎం) ద్వితీయ సెమిస్టర్, ఐదు సంవత్సరాల ఆనర్స్ బి బి ఏ ఎల్ ఎల్ బి, బి ఎ ఎల్ ఎల్ బి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమైనట్లు పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య యం. సుబ్బారావు తెలిపారు. ఎల్ ఎల్ ఎం పరీక్షలు ఎఎన్‌యు తో పాటు, గుంటూరులోని జెసి కాలేజ్ ఆఫ్ లా, ఏసీ కాలేజీ పరీక్ష కేంద్రాలలో కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే ఐదు సంవత్సరాల ఆనర్స్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని టిటిఎం విభాగంలో ప్రారంభమైనట్లు చెప్పారు. పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించినట్లు వివరించారు. వర్సిటీ జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సందర్శించి ఆయన తగుసూచనలు అందించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, డాక్టర్ కె.మోజెస్ తదితరులు

మార్చిలో ఎంజె మాణిక్యాలరావు శతజయంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు

అధ్యాపక ఉద్యమ నేత, శాసనమండలి మాజీ సభ్యులు ఎం.జె.మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలు రాష్ట్రమంతటా వివిధ ప్రాంతాలలో జరుగుతున్నాయని ఎం.జె.మాణిక్యాలరావు మెమోరియల్ కమిటీ అధ్యక్షులు కేఎస్ లక్ష్మణరావు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.మోజెస్ తెలియజేశారు. స్థానిక ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో జరిగిన సమావేశంలో శతజయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటికే కావలి, చిలకలూరిపేట, అమరావతి తదితర ప్రాంతాలలో శతజయంతి ఉత్సవ సభలు జరిగాయని త్వరలో చీరాల, ఏలూరు, ఖమ్మం, భీమవరం, కర్నూలు తదితర పట్టణాలలో జరుగుతాయని చెప్పారు. 2026 మార్చిలో గుంటూరులో శతజయంతి ఉత్సవ సభ పెద్ద ఎత్తున జరుపుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యకోసం, ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ కోసం మాణిక్యరావు కషి చేశారన్నారు. సమాజంలో విద్యార్థులందరికీ విద్య లో సామాజిక న్యాయం ఉండాలని ఆయన తుది శ్వాస వరకు కోరుకున్నారని వివరించారు.కార్యక్రమంలో అధ్యాపకులు ఏం విజయకుమార్, మహేష్ సోమయ్య శాస్త్రి, ఎం కైలాసనాద్, ప్రమీల, ఎల్ వెంకటేశ్వరరావు, కెవిఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఫార్మసీ-అమెరికా టెంపుల్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ సతీష్‌ను అభినందిస్తున్న లావు రత్తయ్య

వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, అమెరికా, పెన్సిల్వేనియా రాష్ట్రం, ఫిలడెల్ఫియాలోని టెంపుల్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రత్తయ్య మాట్లాడు తూ అమెరికా టెంపుల్ యూనివర్సిటీతో ఫార్మా-డి ప్రోగ్రామ్‌కు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న భారతదేశంలోని మొట్టమొదటి సంస్థగా విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, అకడమిక్ పథకాలు చేపట్టడంతోపాటు, సాంస్కృతిక, ఇంటర్ డిసిప్లనరీ అవగాహనను పెంపొందించనున్నామని తెలిపారు. అలాగే పాఠ్య ప్రణాళికలను సంయుక్తంగా రూపకల్పన చేసి, అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్సులు నిర్వహించే యోచనలో ఉన్నామని వివరించారు.ఒప్పందాన్ని సాధ్యమయ్యేలా కృషి చేసిన ఫార్మ డి ప్రోగ్రామ్ డీన్ డాక్టర్ సతీష్ ఎస్.గొట్టిపాటిని రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, సిఇఒ డాక్టర్ మేఘన కూరపాటి పాల్గొన్నారు.

మలినేని విద్యార్థినులకు జాతీయ బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఐటీశాఖ నాల్గవ సంవత్సరం విద్యార్థినులు జాతీయ స్థాయిలో జరిగిన హ్యాక్సలరేట్ 2025 హ్యాకథాన్‌లో గ్రాండ్ విజేతలుగా నిలిచారని కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు తెలియజేశారు. దేశవ్యాప్తంగా 220కిపైగా జట్లు, వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అక్టోబర్ 11న హైదరాబాద్, రాయదుర్గంలోని టి-హబ్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజి ఐటి విభాగం నాల్గవ సంవత్సరం విద్యార్థినులు నదెళ్ల సరిమూర్తి, వసంత నవ్య, హిమబిందు, సుప్రజ, ఉషశ్రీ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి, రూ.1 లక్ష నగదు బముమతి సాధించారన్నారు. జాతీయ స్థాయిలో తమ కళాశాల విద్యార్థులు విజయం సాధించి గర్వకారణమని కళాశాల చైర్మన్ అన్నారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల యాజ మాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్, కళాశాల డీన్‌లు అభినందించారు.

ప్రజలు సంతృప్తి చెందేలా ఫిర్యాదుల పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఒ

జిల్లాలో ప్రజలు నుంచి వివిధ శాఖలకు అందించిన ఫిర్యాదు అర్జీలను దరఖాస్తుదారుల సంతప్తి స్థాయిని మరింతగా మెరుగుపరిచేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో డిఆర్ఒ ఎన్ఎస్కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జెడ్పీ సిఇఒ వి.జ్యోతిబసు, వివిధ శాఖల అధికారులు ప్రజల నుండి 228 అర్జీలు స్వీకరించారు.

బస్ ఓనర్ వేధిస్తున్నాడు..

పెట్రోలు బాటిల్‌తో గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితుడు

బస్సు ఓనర్ వద్ద తీసుకున్న అప్పు తీర్చినా ఇంకా ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరిస్తున్నారని గుంటూరుకు చెందిన 27వ నంబర్ ప్రైవేటు సిటీ బస్ డ్రైవర్ భాను ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశాడు. పెట్రోల్‌బాటిల్‌తో గ్రీవెన్స్ రావటంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది. అక్కడున్న పోలీసు సిబ్బంది పెట్రోల్ బాటిల్‌ను గమనించి వెంటనే లాక్కుకోవటంతో ప్రమాదం తప్పింది.

గుంటూరు ఛానల్ విస్తరణలో న్యాయమైన పరిహారం ఇవ్వాలి..

గుంటూరు ఛానల్ విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అధికారులు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ అన్నారు. పెదనందిపాడు మండలం, రావిపాడుకు చెందిన రైతులతో కలిసి అర్జీ అందచేశారు. గ్రామంలో గరిష్ట ధర రూ.30 లక్షలు ఉంటే, రూ.8 లక్షలుగా ఉన్న కనిష్టధర ప్రకారం పరిహారం చెల్లిస్తామని, ఆర్డీఒ, మండల తహశీల్దార్లు చెప్పటం సరికాదన్నారు.రైతులను మోసం చేయటం దుర్మార్గం అన్నారు. గరిష్ట ధర రూ.30 లక్షలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో భూములు ఇవ్వటానికి సిద్దంగా లేమని, ఆందోళన చేయటం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ భూములు కోల్పోతే ప్రత్యామ్నాయ భూమి లేదని, వ్యవసాయానికి దూరం అవుతామని, కావున అధికారులు గరిష్ట ధర చెల్లించి రైతులకు న్యాయం చేయాలని, అధికారులు బెదిరిస్తున్నారని వాపోయారు. స్పందించిన డిఆర్ఒ న్యాయం చేసామని హామీ ఇచ్చారు. అర్జీ ఇచ్చిన వారిలో పరిటాల శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, డి.రత్నకుమార్, బి.వెంకటరత్తమ్మ, పి.హేమలత, కె.శివకుమారి, జి.రాంబాబు, టి.రామకృష్ణ తదితరులున్నారు.

నీటి ట్యాంకర్లకు మరమ్మతులు చేపట్టాలి

గ్రామాల్లోని నీటి ట్యాంకర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పెదనందిపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన స్థానికులు అర్జీ అందజేశారు. మండలంలోని ఏడు గ్రామాల్లో ఉన్న ట్యాంకర్లకు నాగార్జునసాగర్ నుంచి పైపులైను ద్వారా ట్యాంకర్లను నింపుకొని ఆ నీటిని అవసరాల కోసం వినియోగించుకుంటున్నామని తెలిపారు. నీటి సరఫరా పైపులైన్లు పాడైపోవడంతో నల్లపాడు డ్రైనేజీ మురుగునీరు త్రాగునీటిలో కలుస్తుందని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి కొత్త పైపులైన్లను ఏర్పాటు చేసి, టాంకర్లకు మరమ్మత్తులు చేపట్టాలని కోరారు వినతిపత్రం అందజేసిన వారిలో పంగులూరి రామకష్ణ, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

స్కూల్, కాలేజి వర్కర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలిన స్కూల్ , కళాశాలల స్వీపర్స్ యూని యన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గ్రీవెన్స్ లో అర్జీ అందచేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా వేతనాలు లేకుండా స్కూల్ స్వీపర్స్ ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. నారా లోకేష్ చూసే డిపార్ట్మెంట్లోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే మిగతా డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని, ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని కోరారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. ఐదు రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని డిప్యూటీ డిఇఒ హామీ ఇచ్చారు. అర్జీ ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.అంజలి, రాజేశ్వరి తదితరులున్నారు.

సిమెంట్ రోడ్లు, వంతెన ఏర్పాటు చేయాలి

మా కాలనీకి వంతెన సిమెంటు రోడ్లను ఏర్పాటు చేయాలని మేడికొండూరు మండలం, ఎడ్లపాటి వెంకట్రావు కాలనీవాసులు అర్జీ అందజేశారు. వంతెన లేకపోవడంతో వర్షాలు కురుస్తున్న సమయంలో కొండవీడు వాగు పొంగి ఆ నీరు మా ఇళ్లల్లోకి వస్తుందని తెలిపారు. మురుగునీరు కావడంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. అంతేగాక కాలనీలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం అందజేసిన ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ఎస్టీలు నివసించే మా కాలనీలో సౌకర్యాలు కల్పించాలని కోరారు .

జిఎంసి గ్రీవెన్స్‌కు 47 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని, ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో గ్రీవెన్స్ నిర్వహించిన ప్రజల నుండి 47 అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను విభాగాల అధికారులకు అందజేసి, సత్వర పరిష్కారానికి ఆదేశించారు. తొలుత కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌లో ఫోన్ ద్వారా మరో 28 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి..

గుంటూరు నగరపాలకసంస్థ హెడ్ వాటర్‌వర్క్స్ కార్మికులకు, నగరంలోని వాల్వ్ ఆపరేటర్లకు రెయిన్ కోట్‌లు, బూట్లు, మాస్కులు, గ్లౌజ్‌లు వంటి రక్షణ పరికరాలు ఇవ్వాలని, సర్టిఫికెట్లు ఉండి అన్‌స్కిల్డ్ జీతం పొందుతున్న ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు వారి విద్యార్హతలను బట్టి సెమీస్కిల్డ్, స్కిల్డ్ జీతాలు చెల్లించాలని, గతంలో జరిగిన 16 రోజుల సమ్మె కాలం జీతం చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు, నగర అధ్యక్షులు పి. శ్రీనివాసరావులు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు నాయకులు గ్రీవెన్స్‌లో ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందచేశారు. హెడ్ వాటర్ వర్క్సలో పనిచేస్తే కార్మికులు నిత్యం ఆలం, క్లోరైడ్, బ్లీచింగ్ వంటి రసాయనాలతో పనిచేస్తున్నారని, ఎండలో, వర్షంలోనూ పనిచేస్తారన్నారు. అటువంటి వారికి తక్షణమే రక్షణ పరికరాలు ఇవ్వాలని, అలాగే నగరంలో ఇంటింటికి మున్సిపల్ వాటర్ సరఫరా చేసే వాల్వ్ ఆపరేట్లకు రెయిన్ కోట్‌లు, గ్లౌజ్‌లు, మాస్కులు, బూట్లు, టార్చ్‌లైట్లు వంటి ఇవ్వాలని కోరారు. పలుమార్లు అర్జీలు అందచేస్తున్నా సమస్య పరిష్కారం కావట్లేదన్నారు.

కమిషనర్‌కు అర్జీ అందచేస్తున్న సిఐటియు నాయకులు